

1,688కి చేరిన మద్యం టెండర్ల దరఖాస్తులు

నెహ్రూసెంటర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 61 మద్యం షాపుల టెండర్లను దక్కించుకునేందుకు ఇప్పటి వరకు 1,688దరఖాస్తులు వచ్చినట్లు జిల్లా ఎక్సైజ్ సూపరిండెంట్ బాదావత్ కిరణ్‌నాయక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాగా, జిల్లాలోని గూడూరు, తొర్రూరు, మహబూబాబాద్ ఎక్సైజ్‌స్టేషన్‌ల పరిధిలో దరఖాస్తు చేసుకోవాలనే ఆశావహులు ఈనెల 23న సాయంత్రం 5గంటల్లోపు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. మద్యం టెండర్ల గడువు పొడగించిన తర్వాత బుధవారం రోజున 14 దరఖాస్తులు వచ్చాయని చెప్పారు. ఈనెల 27న లక్కీడ్రా నిర్వహించనున్నట్లు చెప్పారు.

అక్రమ మిల్లర్లపై కొరడా



- సీఎంఆర్ నిబంధనలు మరింత కఠినం
- బ్యాంక్ గ్యారెంటీ ఇస్తేనే మిల్లింగ్
- డిఫాల్ట్ మిల్లులన్నీ బ్లాక్ లిస్టులోనే..
- ఉమ్మడి జిల్లాలో డిఫాల్ట్‌గా 32 మిల్లులు
- బకాయి చెల్లించకుంటే కేసుల నమోదు
- 74వేల మెట్రిక్ టన్నుల మేరకు బకాయి

హనుమకొండ, అక్టోబర్ 22 (ఆంధ్రజ్యోతి): ధాన్యాన్ని మిల్లింగ్ చేయకపోగా దానిని దారి మళ్లించి అక్రమంగా సొమ్ము చేసుకున్న రైస్ మిల్లుల పట్ల మరింత కఠినంగా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. బకాయిలను రాబట్టేందుకు చర్యలు తీసుకుంటోంది. బకాయిలు చెల్లించకుండా తప్పించుకు తిరుగుతున్న మిల్లులపై కేసులు నమోదు చేస్తోంది. కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్)లో ఎలాంటి అవతవకలు జరగకుండా మరింత పగడ్బందీ చర్యలు తీసుకోబోతున్నది. ఈ మేరకు ప్రభుత్వం సీఎంఆర్ నిబంధనలను మరింత కఠినతరం చేసింది. ఈసారి బ్యాంకు పూచీకత్తు (గ్యారెంటీ) తప్పనిసరి చేస్తూ పౌరసరఫరాల శాఖ ఆదేశాలు జారీ చేసింది. గతేడాది నుంచి ఈ విధానం అమలు చేసినప్పటికీ పూచీకత్తు ఇవ్వని మిల్లులకు కూడా ధాన్యం కేటాయించారు. బ్యాంకు ఖాతాలో నగదు లేని మిల్లర్లు కూడా పూచీకత్తు పత్రాలు ఇచ్చారు. ఈసారి పూచీకత్తు ఇవ్వని మిల్లర్లకు ధాన్యం కేటాయించవద్దని ప్రభుత్వం స్పష్టం చేసింది.

పూచీకత్తు తప్పనిసరి

సీఎంఆర్ బకాయిదారులపై కఠినంగా వ్యవహరించేలా గతేడాది వానకాలం సీజన్‌లో మంత్రిమండలి ఉప సంఘం అధ్వర్యంలో కొత్త విధానం తీసుకువచ్చినప్పటికీ క్షేత్రస్థాయిలో సరిగ్గా అమలు కాలేదు. ఈ సారి మాత్రం బ్యాంకు పూచీకత్తు విధానం కచ్చితంగా అమలు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. సీఎంఆర్ బాకాయిలు లేని మిల్లర్లు 10శాతం, డీఫాల్టు అయి బకాయిలు తీర్చేసిన మిల్లర్లు 25 శాతం, మిల్లులు లీజుకు తీసుకున్నవారికి 50 శాతం బ్యాంకు గ్యారెంటీతో పాటు ఇద్దరు మిల్లర్లు పూచీకత్తు తీసుకోవాలని స్పష్టం చేసింది. ఒక వేళ మిల్లర్ బియ్యం ఇవ్వకపోతే ఆ గ్యారెంటీ కింద జమ చేసే డబ్బును జప్తు చేసుకునే అధికారం పౌరసరఫరాల సంస్థకు ఉంటుంది. ఉమ్మడి జిల్లాలో 480 రైస్‌మిల్లులు ఉన్నాయి.

డిఫాల్ట్‌లో 32 మిల్లులు

2021-22 నుంచి 2023-24 వరకు వరంగల్, హనుమకొండ, జనగామ, మహబూబాబాద్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో 32 మంది మిల్లర్లు 74,818 మెట్రిక్ టన్నుల ధాన్యం బకాయి పడ్డారు. బకాయిలను తిరిగి రాబట్టడంలో అధికారులు విఫలమయ్యారు. పలుమార్లు నోటీసులు జారీ చేసినా స్పందించకపోవడంతో ఇక నుంచి వీరి పట్ల మరింత కఠినంగా వ్యవహరించాలని ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఈ మిల్లులను డీఫాల్టు జాబితాల్లో చేర్చి వీటికి సీఎంఆర్ ధాన్యం కేటాయించొద్దని ఆదేశించింది. ఉమ్మడి జిల్లాలో 1,220 కేంద్రాల్లో 28.60 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసేలా అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు.

ఇందులో 270 మిల్లులపై ఎలాంటి కేసులు లేవు. మరో 50 మిల్లులు సీఎంఆర్ బియ్యాన్ని ఆలస్యంగా ఇవ్వడంతో ఫైన్ వేశారు. ఆ ఫైన్ కూడా ఆలస్యంగా చెల్లించడంతో వారిని మన్నించి ఆ మిల్లులకు కూడా 25శాతం బ్యాంకు గ్యారెంటీతో ధాన్యం ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నారు. ధాన్యం కొనుగోళ్ల ప్రారంభం కాకముందే ఈ ప్రక్రియను పూర్తి చేసి మిల్లుల వారీగా ధాన్యం కేటాయించేలా అధికారులు ఇప్పటినుంచే కసరత్తు చేస్తున్నారు. సీఎంఆర్ బకాయిలుండి డీఫాల్టు జాబితాలో ఉన్న మిల్లర్లకు ఈ సారి ఎట్టి పరిస్థితుల్లో సీఎంఆర్ కేటాయించేది లేదని పౌరసరఫరాల సంస్థ అధికారులు స్పష్టం చేశారు. వీరి వద్ద నుంచి బకాయిలు వసూలు చేసేలా తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

సామర్థ్యం మేరకే..

ఉమ్మడి జిల్లాలో ఒక్కో మిల్లుకు గతంలో సామర్థ్యానికి మించి 200 శాతం ధాన్యం ఇచ్చేవారు. ఈ సారి మాత్రం వంద శాతానికి పరిమితం చేశారు. ఒక వేళ మిల్లరు 50 శాతమే కావాలని అడిగితే అంత మేరకే ఇస్తారు తప్ప అధికంగా ఇచ్చేది లేదు. అవసరమైతే ధాన్యాన్ని ప్రభుత్వ గోదాముల్లో భద్రపరచాలని నిర్ణయించారు. మిల్లుల సామర్థ్యం మేరకే ధాన్యం ఇచ్చేలా నిర్ణయించారు.

సీఎంఆర్ బకాయిలు

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 33,368 మెట్రిక్ టన్నుల బియాన్ని మిల్లర్లు బకాయి పడ్డారు. గడువు సమీపిస్తున్నా మిల్లర్లు బియ్యం ఇవ్వకపోవడంతో ఇటీవల పౌరసరఫరాశాఖ, టాస్క్‌ఫోర్సు టీం సంయుక్తంగా

(మిగతా 8లో..)

ఏజెన్సీ మండలాల అభివృద్ధే ధ్యేయం

- పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క
- అభివృద్ధి పనులకు శంకుస్థాపన



కొత్తగూడలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న సీతక్క

కొత్తగూడ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఏజెన్సీ మండలాల్లో అభివృద్ధే ధ్యేయంగా పలు పనులకు నిధులను ప్రభుత్వం మంజూరు చేస్తుందని పంచాయతీరాజ్, స్త్రీ, శిశుసంక్షేమ శాఖమంత్రి సీతక్క అన్నారు. కొత్తగూడలోని కొమరం భీం జయంతి సందర్భంగా ఆయన విగ్రహాన్ని ఆమె పూలమాలలు వేసి, నివాళులర్పించారు. కొత్తగూడ మండలకేంద్రంలో 30 పడకల ఆస్పత్రి నిర్మాణం, సెంట్రల్ లైటింగ్, రోడ్డు వెడల్పు పనుల శంకుస్థాపనలు, పొగుళ్లపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం, గుండం తిమ్మాపూర్‌లో హెల్త్ సబ్‌సెంటర్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం కల్యాణలక్ష్మి పథకంలో 11 మంది లబ్ధిదారులకు చెక్కులను మంత్రి అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత పదేళ్లలో ఏజెన్సీ మండలాల్లో ఎలాంటి అభివృద్ధి పనులు చేయలేదని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే వాగులపై వంతెనలు, గ్రామాల్లో సీసీ రోడ్లు పలు బీటీ రోడ్లకు నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. రాబోయే కాలంలో కొత్తగూడ, గంగారం మండలాలకు రెండు పంటలకు సాగునీరు అందించేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. కొత్తగూడ మండల అభివృద్ధి కోసం రూ.11 కోట్లతో సెంట్రల్ లైటింగ్, రోడ్డు విస్తరణ చేపట్టనున్నట్లు తెలిపారు. ఏజెన్సీ మండలాల్లో మెరుగైన వైద్య సేవలందించేందుకు రూ.13.5 కోట్ల 30 పడకల ఆస్పత్రి నిర్మాణం చేస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు ఓర్వలేకనే బీఆర్ఎస్ నాయకులు సోషల్ మీడియా వేదికగా ఆరోపణలు చేస్తున్నారని, అభివృద్ధి కళ్లారా చూశాక తప్పుడు ప్రచారం మానుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వజ్జ సారయ్య, రూరల్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ చల్లా నారాయణరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుంకరబోయిన మొగిళి, డీసీసీ ప్రధాన కార్యదర్శి బానోత్ రూప్‌సింగ్, మాజీ ఎంపీపీ బానోత్ విజయ, మాజీ జడ్పీటీసీ పుష్పలత, కర్ర జనార్ధన్, బిట్ల శ్రీనివాస్, లావణ్యావెంకన్న, వజ్జ వెంకటలక్ష్మి, ప్రశాంత్‌రెడ్డి, ప్రశాంత్‌యాదవ్, రణధీర్, రంజిత్, రాజు పాల్గొన్నారు.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న గిరిజన సంక్షేమశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సభ్యసాచి ఘోష్

మేడారం జాతర ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలి

- గిరిజన సంక్షేమ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సభ్యసాచి ఘోష్
- హైదరాబాద్‌లో ములుగు కలెక్టర్ సహా అధికారులతో సమీక్ష
- పాల్గొన్న ఉమ్మడి ఆరు జిల్లాల కలెక్టర్లు, అధికారులు

7

పురుగుల మందు తాగిన వ్యక్తి మృతి



సురేష్ (ఫైల్)

నెల్లికుదురు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : రామన్నగూడెం గ్రామానికి చెందిన ఆకుతోట సురేష్ (33) పురుగుల మందుతాగి బుధవారం మృతి చెందినట్లు ఎస్సై సీహెచ్.రమేష్‌బాబు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. ఆకుతోట సురేష్ ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఈనెల 20న అదే గ్రామానికి చెందిన పాశం యాకయ్య, తన తండ్రి యాదయ్య కలసి సురేష్‌ను అసభ్యపదజాలంతో దూషించారు. దీంతో మనస్తాపం చెందిన సురేష్ పురుగుల మందు తాగాడు. వెంటనే గ్రామస్థులు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతుడి తల్లి ఆకుతోట సోమలక్ష్మీ ఫిర్యాదు మేరకు సురేష్ మృతికి కారణమైన ఇద్దరిపై కేసు నమోదు చేసి పోస్టుమార్టంకు తరలించినట్లు ఎస్సై పేర్కోన్నాడు.

3.9 మిల్లీమీటర్ల వర్షం

మహబూబాబాద్ అగ్రికల్చర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో బుధవారం సాయంత్రం డోర్నకల్, కొత్తగూడలో ఓ మోస్తరు వర్షం కురిసింది. బయ్యారం, గార్ల, దంతాలపల్లి, మహబూబాబాద్‌లో చినుకులు పడ్డాయి. మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు 61.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. సగటున 3.9 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. కొత్తగూడలో 11.8, గంగారంలో 7.6, బయ్యారంలో 10.0, మహబూబాబాద్‌లో 2.6, గూడూరులో 5.0, కేసముద్రంలో 3.6, నెల్లికుదురులో 4.0, నర్సింహులపేటలో 7.6, చిన్నగూడూరులో 1.4, మరిపెడలో 1.2, దంతాలపల్లిలో 3.4, తొర్రూరులో 2.2, పెద్దవంగరలో 1.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.



డోర్నకల్‌లో కురుస్తున్న వర్షం

పోటెత్తిన మక్కలు

- మానుకోట మార్కెట్‌కు 12 వేల బస్తాలకు పైగా రాక
- జొన్నలతో కళకళలాడిన యార్డు



మానుకోట వ్యవసాయ మార్కెట్‌కు భారీగా వచ్చిన మక్కలు

మహబూబాబాద్ అగ్రికల్చర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్‌కు మక్కలు పోటెత్తాయి. దీపావళి పండుగ సెలవులు అనంతరం వ్యవసాయ మార్కెట్ తెరుచుకోవడంతో భారీగా మక్కలు రావడంతో మార్కెట్ యార్డు కళకళలాడింది. మార్కెట్‌కు 12,124 బస్తాల మక్కల రాబడులు కొనసాగాయి. బుధవారం మార్కెట్‌లో మక్కలకు గరిష్ఠంగా రూ2,031 ధర పలుకగా కనిష్ఠంగా రూ2,016 ధర పలికింది.

28 నుంచి పత్తి కొనుగోళ్లు..

మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్‌లో

(మిగతా 8లో..)

నేడు కొనుగోళ్లు బంద్..

మార్కెట్‌కు భారీగా మక్కలు రావడంతో ఇబ్బందులు ఏర్పడుతాయన్న ఉద్దేశంతో గురువారం మార్కెట్‌కు మక్కల కొనుగోళ్లు బంద్ చేసినట్లు మార్కెట్ చైర్మన్ ఇస్లావత్ సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. మార్కెట్‌కు నేడు మక్కలు తీసుకురావొద్దని రైతులకు కోరారు. మార్కెట్ యార్డులో ఉన్న మొక్కలు ఖాళీ అయిపోయిన అనంతరం శుక్రవారం తిరిగి మక్కల కొనుగోళ్లు ప్రారంభించనున్నట్లు చెప్పారు.

అనారోగ్యంతో బీఆర్ఎస్ నేత మృతి



మృతుడి కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యేలు రెడ్యానాయక్, ధర్మారావు

మరిపెడ రూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎల్లారిగూడెంకు చెందిన బీఆర్ఎస్ నేత రామడుగు వెంకటేశ్వరావు (80) అనారోగ్యంతో బుధవారం మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న మాజీ మంత్రి, మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్, మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గుడిపుడి నవీన్‌రావు, రామడుగు అచ్యుత్‌రావు, సంకినేని మంగపతిరావు, తక్కెళ్లపల్లి దేవేందర్‌రావు, కాలసాని దామోదర్, గుడిపుడి శ్రీధర్‌లు వెళ్లి మృతదేహంపై పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించి, కుటుంబ సభ్యులను ఓదార్చారు.

మృతుడి కుటుంబానికి బియ్యం అందజేత

పెద్దవంగర, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామచంద్రుతండాకు చెందిన జాటోత సక్రు (60) ఇటీవల మరణించడంతో బుధవారం బీఆర్ఎస్ నాయకులు వారి కుటంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటంబ సభ్యులకు 50కేజీల బియ్యంను అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు. మృతుడి కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని తెలిపారు. జాటోతు దస్రు, హేమాని, పానుగోతు దస్రు, పానుగోతు ప్రదీప్, గాల్యా, యాకు, చంద్రమౌళి, సక్రు, నరేష్, బోజ్యా, దేవ, బాలు, వీరన్న, రఘు, సోమన్న ఉన్నారు.

కార్మికుల పక్షం సీఐటీయూ



సీఐటీయూ జిల్లా మహాసభల కరపత్రం అవిష్కరిస్తున్న ఆ సంఘ బాధ్యులు

మరిపెడ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : సీఐటీయూ ఎప్పటికి కార్మికుల పక్షాన నిలిచి వారి డిమాండ్ల సాధనకు నిరంతరం పోరాడుతుందని ఆ సంఘం మరిపెడ మండల కార్యదర్శి దుండి వీరన్న అన్నారు. బుధవారం మరిపెడబంగ్లాలోని పీహెచ్‌సీ ఆవరణలో దుండి వీరన్న స్థానిక ఆ సంఘ నాయకులతో కలిసి నవంబరు 5,6 తేదీలలో మరిపెడ పట్టణంలో జరిగే సీఐటీయూ జిల్లా మహాసభల కరపత్రాలను అవిష్కరించారు. ఈ మహాసభలకు అ సంఘటిత కార్మిక వర్గాలు, ట్రేడ్ యూనియన్, హామాలీ యూనియన్, బిల్డింగ్, కనస్ట్రక్షన్ యూనియన్ బాధ్యులు పాల్గొని జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కొండ ఉప్పలయ్య, రాములు, సైదులు, వెంకన్న, పుష్పక్, ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

31న యువ కళాకారుల ఎంపిక

జనగామ కల్చరల్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): జాతీ య స్థాయి యువజనోత్సవాలను పురస్కరించుకొని 31న జిల్లా స్థాయి యువ కళాకారులను ఎంపిక చేయనున్న ట్లు జిల్లా యువజన, క్రీడల అధికారి కె.కోదండరాములు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 15 నుంచి 29 సంవత్సరాల లోపు అభ్యర్థులు 31న స్థానిక జూబ్లీ ఫంక్ష న్‌హాల్‌లో ఉదయం 9 గంటల వరకు హాజరు కావాల న్నారు. జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాధించిన వా రిని రాష్ట్ర స్థాయి యువజనోత్సవాలకు ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. జానపద నృత్యం, జానపద పాటలు గ్రూప్, కథా రచన (హిందీ/ఇంగ్లీషు/తెలుగు), పె యింటింగ్, ఉపన్యాసం (హిందీ/ఇంగ్లీషు), కవిత్వం (హిందీ/ఇంగ్లీషు), ఎగ్జిబిషన్ ఆఫ్ సైన్స్ మేళాలో పోటీలు నిర్వహించబడతాయన్నారు. వివరాలకు 96521 97323, 9182552593 నంబర్లలో సంప్రదించాలన్నారు.

ఓటమి రేపటి గెలుపునకు నాంది

● టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఝాన్సీరెడ్డి



చెర్లపాలెం ఉన్నత పాఠశాలలో క్రీడాకారులకు బహుమతులు అందజేస్తున్న టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఝాన్సీరెడ్డి

తొర్రూరు రూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : క్రీడల్లో గెలుపోటములు సహజమని, నేటి ఓటమి రేపటి గెలుపునకు నాంది అని కాంగ్రెస్ పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి, టీపీసీసీ ఉపాధ్యక్షురాలు హనుమాండ్ల ఝాన్సీరెడ్డి అన్నారు. మండలంలోని చెర్లపాలెం ఉన్నత పాఠశాలలో రెండు రోజుల పాటు నిర్వహించిన 69వ ఎస్జీఎఫ్ఐ తొర్రూరు జోనల్ స్థాయి క్రీడలకు హనుమాండ్ల రాజేందర్ రెడ్డి-ఝాన్సీరెడ్డి ఫ్యామిటీ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆర్థికసాయం అందజేశారు. బుధవారం జరిగిన ముగింపు సమావేశంలో ముఖ్య అతిథిగా విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడలతో స్నేహభావం, క్రమశిక్షణ అలవచ్చుకోవచ్చన్నారు. క్రీడలు ఉన్నత విద్యా, ఉద్యోగాల్లో రాణించడానికి ఎంతగానో దోహదపడతాయని సూచించారు. విద్యార్థులు తమ లక్ష్యాలను ఎంచుకొని క్రీడలు, విద్యలో రాణించాలన్నారు. ప్రభుత్వం విద్యారంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తూ, ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులను ప్రోత్సహిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో బుచ్చయ్య, పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం తనూజ, యూత్ స్పోర్ట్స్ ఆఫీసర్ జ్యోతి, నాయకులు పెరటి యాకూబ్ రెడ్డి, దేవేందర్ రెడ్డి, డాక్టర్ సోమేశ్వర్ రావు, పెదగాని సోమయ్య, సోమ రాజశేఖర్, పయ్యావుల ప్రవీణ్ యాదవ్, మహేష్, పాఠశాల అధ్యాపక బృందం, విద్యార్థిని, విద్యార్థులు క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

హోరెత్తిన శివనామస్మరణ



శివ స్వాములకు ఉపదేశం చేస్తున్న రఘురామ్‌శర్మ

మరిపెడ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : శివనామస్మరణతో మరిపెడ శివాలయం హోరెత్తింది. బుధవారం పలువురు భక్తులు మరిపెడ శివాలయంలో వేదపండితులు రఘురామ్‌శర్మచే శివ మాలధారణ చేసుకొని మండలి దీక్ష చేపట్టారు. 40రోజుల పాటు ఈ దీక్షలు అత్యంత భక్తిప్రేతితో నిర్వహించి అనంతరం శ్రీశైలం పుణ్యక్షేత్రాన్ని శివస్వాములు దర్శిస్తారు. ఈ సందర్భంగా ఆ ఆలయ అర్చకులు శివుడికి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు జరిపారు.

ఈకేవైసీ ఉంటేనే ఉపాధి పనులకు అర్హులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో వేణుగోపాల్‌రెడ్డి

మరిపెడ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఈకేవైసీ నమోదు చేసుకుంటేనే ఉపాధి పనులకు కూలీలుగా అర్హులవుతారని మరిపెడ ఎంపీడీవో తెలిపారు. బుధవారం ఈకేవైసీ ప్రక్రియ నమోదుపై ఎంపీడీవో మండల్ పరిషత్ ఆఫీస్‌లో ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో ఆయన సమీక్ష సమావేశం జరిపి మాట్లాడారు. పల్లెల్లోని ఉపాధి కూలీలు ఈకేవైసీ ప్రక్రియను పూర్తి చేసుకోని ఉండాలన్నారు. ఇప్పటి వరకు నమోదు చేసుకోని కూలీలు ఆయా గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్లను, పంచాయతీ కార్యదర్శులను కలిసి తమ పేర్లను ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు. పేర్లు నమోదు కాని కూలీలకు పనులు కలిపించడం జరగదన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో సోమ్లానాయక్, ఏపీవో భీమానాయక్, టెక్నికల్ అసిస్టెంట్లు, వివిధ గ్రామాల కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

వరిలో తెగుళ్ల ఉధృతిని గమనించాలి

గార్ల, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): వరి పండించే రైతులు సరైన సమయంలో తెగుళ్ల ఉధృతిని గమనిస్తూ, సకాలంలో పురుగు మందులను పిచికారి చేసుకోవాలని మం డల వ్యవసాయ శాఖాధికారి కావటి రామారావు సూచించారు. బుధవారం సత్యనారాయణపురంలోని పొలంలో క్షేత్ర సందర్శన చేపట్టి, రైతులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మం డల వ్యాప్తంగా ప్రసుతం వరి పొట్ట దశ నుంచి ఈనక దశకు చేరుకుందని, ఈ వాతావరణ పరిస్థితుల్లో దోమ, తెగుళ్ల ఉధృతంగా వ్యాపించే ప్రమాదం ఉందన్నారు. వీటికి సకాలంలో యాజమాన్య పద్ధతులు పాటించి నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. దోమపోటు నివారణకు పిమెట్రోజీన్ మిశ్రమం 0.5 గ్రాములు లేదా డైనోటెఫురాన్ 0.గ్రాములు లేదా పైమెట్రోజీన్‌మిశ్రమం మందును 0.65గ్రామలను లీటర్ నీటిలో కలిపి మొక్కల మొదలు భాగం పూర్తిగా తడిసేలా పిచికారి చేయాలన్నారు. కార్యక్రమంలో గ్రామంలోని పలువురు రైతులు పాల్గొన్నారు



పొలాన్ని పరిశీలిస్తున్న కావటి రామారావు

జీపీవోలు ప్రజలకు అందుబాటులో ఉండాలి



తహసీల్దార్ కార్యాలయంలో మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాస్

తొర్రూరురూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : సమస్యల పరిష్కారానికి వచ్చే ప్రజలకు జీపీవోలు అందుబాటులో ఉండాలని తహసీల్దార్ గడీల శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండల తహసీల్దార్ కార్యాలయంలో మండలంలోని జీపీవోలు, కార్యాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామాల్లో నెలకొన్న భూ సమస్యల పరిష్కారం కోసం, వివిధ సర్టిఫికేట్ల మంజూరీ కోసం పూర్తిస్థాయిలో విచారణ చేసి పరిష్కరించాలన్నారు. ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజలతో గౌరవంగా ఉండాలని, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో డీటీ నర్సయ్య, ఆర్ఐ నజీముద్దీన్, ప్రవీణ్ రెడ్డి, జీపీవోలు పాల్గొన్నారు.

వరి పంట సంరక్షణకు చర్యలు తీసుకోవాలి



కంతాయపాలెంలో వరి పంటను పరిశీలిస్తున్న ఏవో రాంనర్సయ్య

తొర్రూరు రూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : రైతులు పంట సంరక్షణకు అధికారుల సూచనలతో చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి రాంనర్సయ్య అన్నారు. బుధవారం మండలంలోని కంతాయపాలెం లో వరి పంటను పరిశీలించి మాట్లాడుతూ ప్రస్తుతం వరిలో అగ్గితెగులు, అగ్గి తెగులు వ్యాప్తి చెందుతుందన్నారు. దాని నివారణకు రైతులు వరి మొదలు పరిశీలించి ఎప్పటికప్పుడు మందులు పిచ్చికారి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమం లో ఏఈవో భరత్‌చంద్ర, రైతులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై నిలిచిన ఆర్టీసీ ఎలక్ట్రిక్ బస్



మరిపెడబంగ్లా కార్గిల్ సెంటర్‌లో నిలిచిపోయిన ఆర్టీసీ ఎలక్ట్రిక్ బస్

మరిపెడ,అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): వరంగల్-2 డిపోకు చెందిన ఓ ఆర్టీసీ ఎల క్ట్రిక్ బస్ ఖమ్మం నుంచి ప్రయాణికులతో వరం గల్‌కు వెళ్తుండగా సాం కేతిక లోపంతో బుధవారం మరిపెడబంగ్లాలోని కార్గిల్ సెంటర్ దగ్గర ఎన్‌హెచ్‌ఏ రోడ్డుపై నిలిచింది. దీంతో ట్రాఫి క్‌కు అంతరాయం ఏర్పడింది. మునిసిపల్ అధికారులు కొద్ది సేపు జాతీయ రహదారిపై వెళ్లే వాహనాలను వన్‌వేపై మళ్లించారు. ప్రయాణికులను వేరే బస్సులలో గమ్యస్థానానికి పంపారు. ఆర్టీసీ సిబ్బందిపై అధికారులకు ఈ విషయం తెలుపడంతో మెకానిక్‌లను పంపి దానిని రిపేరు చేశారు. అనంతరం ఆ బస్ వరంగల్‌కు వెళ్లింది.

సాధువుల వేషంలో హల్‌చల్

గాజుల దుకాణం యజమానురాలిపై పౌడర్ చల్లి.. డబ్బులు లాక్కెళ్లిన సాధువులు..

కారులో పారిపోతుండగా పట్టుకున్న వ్యాపారులు

జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్‌లో ఘటన



పారిపోతున్న సాధువులను అడ్డుకొని నిలదీస్తున్న వ్యాపారులు

స్టేషన్‌ఘన్‌పూర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): సాధువుల వేషధారణలో వచ్చిన నలుగురు వ్యక్తులు బుధవారం జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్‌లో హల్‌చల్ చేశారు. పలు షాపులు తిరిగి రుద్రాక్షలు, శాంతి పూజలు చేస్తే లాభాలు వస్తాయని నమ్మించే ప్రయత్నం చేశారు. ఓ బ్యాంగిల్ స్టోర్ యజమానురాలిపై పౌడర్ చల్లి డబ్బులు తీసుకోవడంతో స్థానికులు అడ్డుకుని పోలీసులకు అప్పగించారు. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. రాజస్థాన్ రాష్ట్రంలోని సిరోయి పట్టణానికి చెందిన అనాపంథ్, వంచొడ్‌నాథ్, రూప్‌నాథ్, రమేష్‌నాథ్‌లు సాధువుల వేషంలో డ్రైవర్ సాయంతో కారులో స్టేషన్‌ఘన్‌పూర్‌కు చేరుకున్నారు. పట్టణంలోని పలు షాపుల వద్దకు వెళ్లి శాంతిపూజలు నిర్వహిస్తే వ్యాపారం లాభసాటిగా సాగుతుందని యజమానులకు నమ్మించారు. వారికి రుద్రాక్షమాలలు ఇచ్చే ప్రయత్నం చేసినా యజమానులు నమ్మక నిరాకరించారు.

అయితే రైల్వేగేట్ సమీపంలోని ఆయిమాత బ్యాంగిల్ స్టోర్‌లోకి ఇద్దరు సాదువులు వెళ్లగా, మరో ఇద్దరు కారులోనే డ్రైవర్‌తోపాటు ఉన్నారు. షాపులోకి వెళ్లిన సాదువులు యజమాని తారామాతతో మాట్లాడి తమకు సాయం చేయాలని కోరగా యాభై రూపాయలు ఇచ్చింది. తమ వద్ద రుద్రాక్ష తీసుకుని, శాంతిపూజ చేస్తే వ్యాపారంలో లాభాలు వస్తాయని నమ్మించారు. ఇంతలోనే వారి వెంట తెచ్చుకున్న ఒక రకమైన పౌడర్‌ను ఆమెపై చల్లారు. దీంతో ఆమె ఇప్నాటైజ్‌గా మారి సాధువులు చెప్పినట్లు వింటూ రూ.500 చొప్పున రెండుసార్లు ఇచ్చింది. షాపులోంచి సాధువులు ఎంతకీ బయటకు రాకపోవడంతో గమనించిన ఎదురుగా మరో షాపులో ఉన్న తారామాత సోదరుడు దిలీప్ షాపువద్దకు వచ్చి సాదువులను ప్రశ్నించాడు. దీంతో భయపడిన సాధువులు సమీపంలో ఉన్న కారులో ఎక్కి పారిపోయే ప్రయత్నం చేశారు.

చుట్టుపక్కల వ్యాపారులు కారుకు అడ్డుపడి కారులో నుంచి స్వాములను కిందకు దించి నిలదీశారు. విషయం తెలుసుకున్న ఎస్సై వినయ్‌కుమార్ ఆధ్వర్యంలోని పోలీసులు అక్కడికి చేరుకొని సాధువులను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పోలీస్ స్టేషన్‌లో వారిని సాధువులను విచారించి బ్యాంగిల్ షాపు యజమాని వద్ద నుంచి వసూల్ చేసిన డబ్బులు రూ.1,250 నగదును వారికి ఇప్పించారు. సాధువులు వెంట తెచ్చుకున్న పౌడర్‌ను పరిశీలించి పడవేయించారు. సీఐ జి.వేణు సాధువులకు కౌన్సెలింగ్ ఇచ్చి వారి, అడ్రస్‌లు, ఆధార్‌కార్డు జిరాక్స్ పత్రాలు తీసుకొని సొంత పూచికత్తుపై సాధువులను పంపించారు.

రిజర్వేషన్ బిల్లును తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్చాలి

బీసీ జేఏసీ చైర్మన్ పైడిపల్లి రమేష్

భూపాలపల్లిటౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): బీసీలకు 42 శాతం రిజర్వేషన్ బిల్లును తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్చాలని బీసీ జేఏసీ చైర్మన్ పైడిపల్లి రమేష్ అన్నారు. భూపాలపల్లిలోని తెలంగాణ ప్రజాఫ్రంట్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జస్టిస్ ఈశ్వరయ్య, ఐఏఎస్ అధికారి చిరంజీవులు, డాక్టర్ విశారదన్ మహారాజ్‌ల నా యకత్వంలో బీసీ రిజర్వేషన్ బిల్లును తొమ్మిదో షెడ్యుల్‌లో చేర్చాలనే డిమాం డ్ మేరకు ఈ నెల 24న నిర్వహించే 'చలో హైదరాబాద్' కార్యక్రమాన్ని విజ యవంతం చేయాలని కోరారు. జిల్లాలోని అన్ని వర్గాల ప్రజలు అధిక సంఖ్య లో హాజరు కావాలన్నారు. విలేకరుల సమావేశంలో బీసీ జేఏసీ వర్కింగ్ చైర్మ న్ గట్ల రాజన్న, కన్వీనర్లు జోగు బుచ్చయ్య, బర్ల గట్టయ్య, క్యాతరాజు సాంబ మూర్తి, సభ్యులు తాటికంటి రవి, కొండపర్తి ఇస్తారీ, గట్టయ్య, పూర్ణయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

వెంకటాపురం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పీఏసీఎస్ అధ్యక్షుడు చిడెం మోహన్‌రావు అన్నారు. బుధవారం మండలంలోని ఆలుబాక, వెంకటాపురం మార్కెట్‌యార్డులో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభిచి మాట్లాడారు. రైతులు తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించి ప్రభుత్వ మద్దతు ధర పొందాలన్నారు. ఏగ్రేడ్ రకం క్వింటాకు 2389, కామన్ రకానికి రూ.2369 ఉందని, సన్నాలకు అదనంగా క్వింటాకు రూ.500బోనస్ అందించడం జరుగుతుందని అన్నారు. ఈకార్యక్రమంలో పీఏసీఎస్ కార్యదర్శి సత్యనారాయణ, సొసైటీ డైరెక్టర్, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్య సాధనకు కృషి చేయాలి

వెంకటాపురం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు తమ లక్ష్యసాధనకు కృషి చేయాలని కాఫేడ్ స్వచ్ఛంద సేవా సంస్థ డైరెక్టర్ లూర్ధురాజు అన్నారు. యువత విద్యను మెరుగుపరచుకోవడంపై ములుగు జిల్లా వెంకటాపురం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు బుధవారం అవగాహన సదస్సుకు ఆయన హాజర య్యారు. విద్యార్థులు క్రమం తప్పకుండా తరగతులకు హాజరై శ్రద్ధగా చదువుకోవాల న్నారు. మొబైల్ ఫోన్లకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రామకృష్ణ, సంస్థ మండల కోఆర్డినేటర్ గొంది హనుమంతు, సభ్యులు కామేష్, భాస్కర్, ఉష, ఇందిర తదితరులు పాల్గొన్నారు.



ఆస్ట్రేలియాలో ఒరికా ప్రతినిధులతో మంత్రి శ్రీధర్‌బాబు

తెలంగాణలో మరిన్ని పెట్టుబడులు పెట్టండి

● దిగ్గజ సంస్థ ఒరికాకు మంత్రి శ్రీధర్‌బాబు ఆహ్వానం

మహదేవపూర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : దేశంలో పారిశ్రామికాభివృద్ధిలో ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్‌గా నిలుస్తున్న తెలంగాణలో మరిన్ని పెట్టుబడులు పెట్టాలని ఆస్ట్రేలియా ప్రధాన కేంద్రంగా కార్యకలాపాలను నిర్వహిస్తున్న దిగ్గజ సంస్థ ఒరికా ప్రతినిధులను మంత్రి శ్రీధర్‌బాబు కోరారు. ఆ దేశ పర్యటనలో భాగంగా బుధవారం మెల్‌బోర్న్‌లో పారిశ్రామిక పేలుడు పదార్థాల తయారీ, మైనింగ్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ తదితర రంగాల్లో అంతర్జాతీయ అగ్రగామిగా ఉన్న సంస్థ సీఈవో, మేనేజింగ్ డైరెక్టర్ సంజీవ్ గాంధీ, ఇతర ప్రతినిధులతో మంత్రి ప్రత్యేకంగా భేటీ అయ్యారు. తెలంగాణలో పారిశ్రామిక పెట్టుబడులు పెట్టడానికి అనువైందని చెప్పారు. దీనిపై సంజీవ్ రాష్ట్ర ప్రభుత్వంలో కలిసి పనిచేయడానికి తాము సిద్ధంగా ఉన్నామని ఒరికా సంస్థ సీఈవో ఎండి.సంజీవ్ గాంధీ తెలిపారు.ఆస్ట్రేలియాకు విచ్చేసిన శ్రీధర్‌బాబును కంపెనీ ప్రతినిధులు సన్మానించారు.

యువకుడిపై పోక్సో కేసు నమోదు

వెంకటాపురం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): యువకుడిపై పోక్సో కేసు నమోదైన సంఘటన ములుగు జిల్లా వెంకటాపురం మండల కేంద్రంలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్సై తిరుపతిరావు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన 22 ఏళ్ల యువకుడు పదేళ్ల బాలికను స్కూల్ వద్ద దింపుతానంటూ బైక్‌పై తీసుకెళ్లి ఎవరూ లేని సమయంలో గ్రామ శివారు వద్ద అసభ్యకరంగా ప్రవర్తించాడు. దీంతో బాలిక తప్పించుకొని పారిపోయి ఇంటికి చేరుకుంది. జరిగిన విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలిపింది. దీంతో వారు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా యువకుడిపై పోక్సో కేసు నమోదైంది.

బైక్- ఆయిల్ ట్యాంకర్ ఢీ

●ఒకరి మృతి - మరొకరికి తీవ్ర గాయాలు

● బచ్చన్నపేట మండలంలో ఘటన

బచ్చన్నపేట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహ న దారులను ఆయిల్ ట్యాంక ర్ ఢీకొనడంతో ఒక రు మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలైన ఘటన బుధవా రం జనగామ జిల్లా బచ్చన్నపేట-ఆలేరు ప్రధాన రహదారి పై కొలనుపాక, పోచన్నపేట గ్రామాల మధ్య చోటు చేసుకుంది. ఎస్ఐ అబ్దుల్ హ మీద్ కథనం ప్రకారం.. బచ్చన్నపేట మండలంలోని బండనాగారంనకు చెందిన నల్ల రాజేందర్‌రెడ్డి(23), ఈదులకంటి రమేష్‌రెడ్డిలు పాల బిల్లులు తెచ్చేందుకు చేర్యాలకు వెళ్లారు. అనంతరం ఆలేరు వైపు బైక్‌పై వెళ్తుండగా, ఆలేరు నుంచి బచ్చన్నపేట వైపు వస్తున్న ఆయిల్ ట్యాంకర్ ఢీకొట్టింది. ఈ ఘటనలో నల్ల వసంత- చంద్రారెడ్డిల కుమారుడు రాజేందర్‌రెడ్డి అక్కడికక్కడే మృతి చెందగా, రమేష్‌రెడ్డి తలకు తీవ్ర గాయాలై అపస్మారక స్థితికి చేరుకున్నాడు. రమేష్ రెడ్డిని జనగామకు తరలించగా, పరిస్థితి విషమించ టంతో హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రికి తరలించారు. ఘ టనా స్థలానికి చేరుకున్న ఎస్ఐ అబ్దుల్ హమీద్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపా రు. అవివాహితుడైన రాజేందర్ కూలీనాలీ చేసుకుని జీవిస్తుండగా, రమేష్‌రెడ్డి పాల కేంద్రంలో పనిచేస్తున్నాడు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలి మృతి

పాలకుర్తి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి) : మోటార్ సైకిల్ ఢీకొట్టడంతో వృద్ధురాలు మృతి చెందిన ఘటన జనగామ జిల్లా పాలకుర్తి మండలం గూడూరులో బుధవారం జరిగింది. ఎస్సై దూలం పవన్‌కుమార్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఈరెల్లి ఎల్లమ్మ (60) నిత్యావసర వస్తువులు కొనుగోలు చేసేందుకు నడుచుకుంటూ రోడ్డు దాటుతుండగా, పాలకుర్తి నుంచి స్టేషన్‌ఘన్‌పూర్ వైపు మోటార్ సైకిల్ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలి మేనల్లుడు చెరిపల్లి సురేష్‌బాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. భర్త గతంలోనే మృతిచెందగా, సంతానం లేకపోవడంతో సోదరుడి ఇంటివద్ద ఉంటోంది. ఎల్లమ్మ మృతితో విషాదం నెలకొంది.

వరిలో 'గేమ్ ఛేంజర్'

- కల్వలలో ప్రయోగాత్మకంగా 'డీఆర్ఆర్ ధాన్ 75' సాగు
- వరి పరిశోధన సంస్థ రూపొందించిన కొత్త వంగడం
- గాలివాన, తెగుళ్లను తట్టుకొని రెట్టింపు దిగుబడి ప్రత్యేకత
- ఎకరాకు 35 నుంచి 45 క్వింటాళ్ల చొప్పున గింజల వృద్ధి
- విత్తనం కోసం రైతుల నుంచి డిమాండ్

కేసముద్రం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : వరి రకాల్లో తక్కువ ఎత్తుతో గాలివానను, తెగుళ్లను తట్టుకొని రెట్టింపు దిగుబడి నిచ్చే గేమ్‌ఛేంజర్‌లాంటి వంగడాన్ని కేసముద్రం మండలం కల్వలలో ప్రైవేటు డిగ్రీ జంతు శాస్త్ర లెక్చరర్, రైతు చల్లా వెంకటేషం ప్రయోగాత్మకంగా సాగు చేస్తున్నాడు. హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని భారతీయ వరి పరిశోధన సంస్థ తొమ్మిదేళ్లు పరిశోధించి రూపొందించిన ఈ వంగడం విత్తనాలకు రైతుల్లో విపరీతమైన డిమాండ్ ఉంది. ఇంకా మార్కెట్లోకి వాణిజ్యపరంగా ఈ విత్తనాన్ని సంస్థ విడుదల చేయలేదు. ఈ ఏడాది మే నెలలో ఆ సంస్థ నుంచి ఒక కిలో విత్తనం సంచి రైతు వెంకటేషానికి ఉచితంగా అందించారు. ఈ విత్తనాన్ని తనకున్న వరిలో ఐదు గుంటల్లో ఒక్కో పిలక చొప్పున నారును నాటి సాధారణ వరిలాగే సాగు చేశాడు. తక్కువ ఎత్తుతో వరికంకులకు విపరీతమైన గింజలతో ప్రస్తుతం ఈ రకం కోత దశకు వచ్చింది. బీపీటీ రకంలాగా ఉంటూ ఎత్తుతక్కువగా, తెగుళ్లను తట్టుకుంటూ అధిక దిగుబడి ఇచ్చే విధంగా వంగడాన్ని తయారు చేసినట్లు ఆ సంస్థ శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

ఈ వరిలో అన్నీ విశేషాలే...

'డీఆర్ఆర్ ధాన్ 75' రకం వరి వంగడంలో అన్నీ విశేషాలే. ఈ రకం వరి ఎత్తుతక్కువగా ఉండడం వల్ల సాధారణ రకం వరిలాగే గాలివానకు త్వరగా నేలవాలిపోదు. ఒక వరిమొక్క నాటగా 10 నుంచి 12 పిలకలు చొప్పున ఏర్పడి ఒక్కో వరికంకికి 300 నుంచి 450 గింజలు వేయడం విశేషం. సాధారణ బీపీటీ రకంలోనైతే 150 నుంచి 200 గింజలు ఉంటాయి. ఈ రకం అగ్గితెగులు, ఎండుతెగులు తట్టుకునేలా శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. బీటీపీ రకం వరి అయితే వెయ్యి గింజల బరువు 12 నుంచి 13.5గ్రాములు ఉండగా ఈ రకం వరిలో వెయ్యి గింజల బరువు 16 గ్రాములు వస్తోంది. వెంకటేషం సాగు చేసిన ఐదు గుంటల వరిలో ఆరు క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చేలా గింజలు అభివృద్ధి చెందినట్లు తెలిపారు. ఈ లెక్కన ఎకరాకు 35 నుంచి 45 క్వింటాళ్ల దిగుబడి చొప్పున వస్తున్నట్లుగా వెంకటేషం చెబుతున్నారు. అన్నీ విశేషాలే ఉన్న ఈ రకం వరికి విపరీతంగా డిమాండ్ ఉండడంతో రైతులు ఎంతో ఆసక్తి ప్రదర్శిస్తున్నారు. ఈ వరిధాన్యాన్ని తిరిగి విత్తనాలుగా ఉపయోగించే అవకాశం ఉండడంతో కిలో విత్తనాలను రూ.100 నుంచి రూ.150 చొప్పున ప్రయోగాత్మకంగా సాగు చేసిన కొన్ని ప్రాంతాల్లోని రైతులు విక్రయిస్తుండడం గమనార్హం. ఏదేమైనా వరి వంగడాల్లో విప్లవాత్మక మార్పును తీసుకువస్తూ, తెగుళ్లను, గాలివానను తట్టుకొని రెట్టింపు దిగుబడి నిచ్చే ఈ రకం విత్తనాన్ని వరిలో 'గేమ్‌ఛేంజర్'గా పలువురు రైతులు భావిస్తున్నారు.



కల్వలలో సాగు చేస్తున్న డీఆర్ఆర్ ధాన్ 75 రకం వంగడం పొలంలో అధికంగా వేసిన వరిగొలుసులు



సమీక్ష సమావేశంలో పాల్గొన్న ఉమ్మడి వరంగల్ జిల్లా ఉన్నతాధికారులు

మేడారం జాతర ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలి

- గిరిజన సంక్షేమ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సభ్యసాచి ఘోష్
- హైదరాబాద్‌లో ములుగు కలెక్టర్ సహా అధికారులతో సమీక్ష

ములుగు కలెక్టరేట్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లాలోనరి మేడారం సమ్మక్క-సారలమ్మ మహాజాతర ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని గిరిజన సంక్షేమ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సభ్యసాచి ఘోష్ సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. హైదరాబాద్‌లోని సచివాలయంలో ములుగు కలెక్టర్ టీఎస్.దివాకరతో కలిసి ఆయా శాఖల ఉన్నతాధికారులతో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. మేడారం జాతర ఏర్పాట్లను 8 జోన్లు, 31 సెక్టార్లుగా విభజించినట్లు తెలిపారు. జోన్-3 జంపన్నవాగు ప్రాంతంగా నిర్ణయించినట్లు తెలిపారు. మహాజాతర సమయంలో 10 నుంచి 12 వేల మంది పోలీసులు విధుల్లో పాల్గొంటారని, ప్రతీ జోన్‌ను ఒక జోనల్ ఆఫీసర్ పర్యవేక్షిస్తారని పేర్కొన్నారు. 24శాశ్వత టవర్లు, 20 సెల్‌ఆన్‌వీల్స్, 350 వైఫై పాయింట్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. 49 పార్కింగ్ ప్రదేశాలను గుర్తించి 6 లక్షల వాహనాలు నిలిపే సౌకర్యం కల్పించనున్నట్లు తెలిపారు. ఈ ఏర్పాట్లు నవంబరు 30 నాటికి పూర్తవుతాయన్నారు. అటవీ శాఖ ఆధ్వర్యంలో 33 ఫారెస్టు రోడ్లను అభివృద్ధి చేయనున్నామని అన్నారు. వీటిలో భాగంగా వైల్డ్‌లైఫ్ శాంక్చువరీలోని రహదారులను కూడా అభివృద్ధి చేయనున్నట్టు చెప్పారు. ఆర్‌అండ్‌బీ శాఖ ద్వారా రూ.42 కోట్లతో ఆలయం చుట్టూ రహదారులు, రూ.92 కోట్లతో ప్రధాన రహదారులను నిర్మించనున్నట్టు తెలిపారు.

జాతర సమయానికి ముందు, మధ్య, తర్వాత ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు ప్రత్యేక జాతర సందర్శనలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. జంపన్నవాగు వద్ద తాత్కాలిక రహదారి కూలిపోయిన కారణంగా మరమ్మతు పనులు వేగంగా జరుగుతున్నాయని, 517 బోరుపాయింట్లు, 250 కిలోమీటర్ల రహదారులపై లైటింగ్ పనులు జరుగుతున్నాయని అన్నారు. స్థానికుల సహకారంతో ఆరు స్లాటర్ సెంటర్లు ఏర్పాటయ్యాయని, జంపన్నవాగు పునరుద్ధరణ పనులు సాగుతున్నాయని పేర్కొన్నారు. 9,111 విద్యుత్ స్తంభాలు, 259 ట్రాన్స్‌ఫార్మర్లు అమర్చే పనులను విద్యుత్‌శాఖ చేపట్టిందని, జాతర ప్రాంతమంతా ఎండోమెంట్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాట్లు జరుగుతాయని వివరించారు. అన్ని శాఖలు సమన్వయంలో పనిచేసి మేడారం సమ్మక్క-సారలమ్మల మహాజాతర విజయవంతంగా జరిగేలా ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో లాఅండ్ ఆర్డర్ అడిషనల్ డీజీపీ మహేష్ భగవత్, ములుగు, వరంగల్, హనుమకొండ జిల్లాల కలెక్టర్లు, ములుగు ఎస్పీ శబరీశ్, ఏటూరునాగారం ఐటీడీఏ పీవో చిత్ర మిశ్రా, ములుగు డీఎఫ్‌వో రాహుల్ కిషన్‌జాదవ్, విద్యుత్ శాఖ సీఎండీ వరుణ్‌రెడ్డి, సమాచార పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ ప్రియాంక, ఇతర శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

సీతంపేటలో నేతకానిల కోలాహలం

- సందడిగా జోడెద్దుల విగ్రహాల నిమజ్జనం
- కోలాటం, ఆటపాటలతో ఊరేగింపు
- నేటితో ముగియనున్న ఉత్సవాలు



జోడెద్దుల విగ్రహాలను ఊరేగిస్తున్న నేతకాని కులస్తులు

హసన్‌పర్తి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోనే వినూత్నంగా మూడు రోజుల పాటు నిర్వహించే సీతంపేట నేతకాని కులస్తుల దీపావళి బతుకమ్మ వేడుకలు గురువారంతో ముగియనున్నాయి. బుధవారం నేతకానీల కుటుంబ సభ్యులంతా కేదారీశ్వరస్వామి వ్రతం నోముకొని జోడెద్దుల విగ్రహాలకు పిండివంటలతో చేసిన నగల (నాగళి, కోల, దుత్తలు, గొడుగు)తో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. పాడిపంటలు సమృద్ధిగా పండాలని, వ్యవసాయం సజావుగా సాగాలని, అధిగ దిగుబడులు రావాలని, పిల్లాపాపలను చల్లగా ఉండాలని వేడుకున్నారు.

జోడెద్దుల ప్రతిమల నిమజ్జనం

మూడు రోజుల పాటు జరిగే ఈ దీపావళి బతుకమ్మ వేడుకల్లో బుధవారం పురుషుల ఘట్టం ప్రారంభమైంది. కేదారీశ్వర వ్రతం ముందు ఏర్పాటు చేసిన జోడెద్దుల ప్రతిమలకు ప్రత్యేకంగా అలంకరించిన నగలతో కూడిన ప్రతిమలను తీసుకొని కోలాటంతో ఊరేగింపుగా ఊరు శివారులోని కుంటకు చేరుకున్నారు. అనంతరం కుంట వద్ద జోడెద్దుల ప్రతిమలకు కుల పెద్దలు ఆరగింపు చేసి పిండి వంటలతో చేసిన నగలను తీసి ఒకరికొకరు తినిపించుకొని వరుసైన వారితో (మగవారు మాత్రమే) రంగులు చల్లుకొని జోడెద్దులను నిమజ్జనం చేశారు. ఈ వేడుకలకు వివిధ రాష్ట్రాల్లో ఉద్యోగరిత్యా ఆయా ప్రాంతాల్లో స్థిరపడిన నేతకాని కులస్తులు ఈ వేడుకల్లో పాల్గొని తమ కుటుంబ సభ్యులతో సంబురంగా గడిపారు. పురుషుల కోలాటం, పాటలు గ్రామస్థులను అలరించాయి. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జనగాం శరత్‌కుమార్, ఎంపీటీసీ మాజీ సభ్యురాలు బండారి రజిత చేరాలు, కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు జాడి రాజీవ్‌గాంధీ, గొళ్లె రాజయ్య, నేతకాని కుల పెద్దలు, రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు పాల్గొన్నారు.

నేటితో ముగియనున్న వేడుకలు

నేతకాని కులస్తుల దీపావళి బతుకమ్మ వేడుకలు మూడోరోజు గురువారం ముగియనున్నాయి. మహారాష్ట్ర నుంచి వలస వచ్చిన నేతకాని కులస్తులు మాత్రమే ఈ వేడుకలు దీపావళి పర్వదినం నుంచి మూడు రోజుల పాటు నిర్వహించుకుంటారు. ఈ ప్రాంత నేతకాని కులస్తులు స్త్రీ, పురుషులు వేర్వేరుగా జరుపుకునే ఈ దీపావళి బతుకమ్మ వేడుకలకు ఇతర రాష్ట్రాల్లో స్థిరపడిన నేతకాని కులస్తులు, వారి బంధువులు పెద్ద సంఖ్యలో సీతంపేటకు తరలిరావడంతో గ్రామంలో సందడి నెలకొంది. ఈ పండుగను నేతకాని కులస్తులు భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారు.



పాటలు పాడుతున్న నేతకాని కుల పెద్దలు



కుంట వద్ద జోడెద్దుల విగ్రహాలకు హారతి ఇస్తున్న నేతకాని కులస్తులు

రేపు కేయూలో కాళోజీ ఎండోమెంట్ లెక్చర్

కేయూ క్యాంపస్ అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రజాకవి కాళోజీ నారాయణరావు 9వ ఎండోమెంట్ లెక్చర్ అక్టోబరు 24న శుక్రవారం ఉదయం 11 గంటలకు కేయూ సెనెట్ హాల్‌లో నిర్వహిస్తామని కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ భాష, సాంస్కృతిక విభాగం డైరెక్టర్ ఎనుగు నరసింహారెడ్డి హాజరై 'సాయుధ పోరాటం, తొలిమలిదశ ఉద్యమాలు :కవిత్వం' అనే అంశంపై కీలక ప్రసంగం చేస్తారని వెల్లడించారు. కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి అధ్యక్షత వహిస్తారని పేర్కొన్నారు. అధ్యాపకులు, స్కాలర్లు, విద్యార్థులతో పాటు ఉద్యోగలందరూ హాజరుకావాలని రిజిస్ట్రార్ రామచంద్రం కోరారు.

అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఎస్ఏ పరీక్షలు

- ఈనెల 24 నుంచి ప్రారంభం.. అన్ని ఏర్పాట్లు పూర్తి
- జిల్లా పరీక్షల బోర్డు ప్రశ్నాపత్రాలతోనే పరీక్షలు
- నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు: డీఈవో వాసంతి



హనుమకొండ, అక్టోబర్ 22 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత విద్యా సంవత్సరం జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలల్లో సంగ్రహణాత్మక మూల్యాంకనం-1 (ఎస్ఏ) పరీక్షలు ఈనెల 24 నుంచి 31వ తేదీ వరకు జరుగుతాయని హనుమకొండ జిల్లా ఉమ్మడి పరీక్షల బోర్డు (డీసీఈబీ) చైర్మన్, జిల్లా విద్యాశాఖాధికారి డి.వాసంతి, డీసీఈబీ కార్యదర్శి బి.రాంధన్‌లు తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలల్లో 1వ తరగతి నుంచి 10వతరగతి వరకు విద్యా భ్యాసం చేస్తున్న ప్రతీ విద్యార్థి పరీక్షలకు హాజరవుతారని తెలిపారు. తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ మాధ్యమంలో పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. జిల్లా ఉమ్మడి పరీక్షల బోర్డుకు ఫీజు చెల్లించిన ప్రకారం 6వతరగతి నుంచి 10వతరగతి వరకు 56,194 మంది విద్యార్థులు, 1వ తరగతి నుంచి 5వతరగతి వరకు ప్రభుత్వ పాఠశాలల్లో 14,646 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారని తెలిపారు. వీరిలో తెలుగు మాధ్యమంలో 200, ఇంగ్లీష్‌లో 14,097, ఉర్దూలో 349 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని, 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు అన్ని యాజమాన్యాల పాఠశాలల్లో తెలుగు మాధ్యమంలో 267, ఇంగ్లీష్‌లో 55,766, ఉర్దూలో 161మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన టైం టేబుల్‌ను అనుసరించి అన్ని యాజమాన్యాలు హనుమకొండ జిల్లా ఉమ్మడి పరీక్షల బోర్డు సరఫరా చేసిన ప్రశ్నపత్రాలతోనే విద్యార్థులకు పరీక్షలు నిర్వహించాలని, పరీక్షల నిబంధనలు ఉల్లంఘించినట్లయితే నియమావళి 25 (1997) చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు మండల విద్యాధికారుల నుంచి పరీక్షకు ఒక రోజు ముందుగా ప్రధానోపాధ్యాయులు ప్రశ్నపత్రాలు తీసుకొని వెళ్లి సీనియర్ ఉపాధ్యాయుడు జాయింట్ కస్టోడియన్‌గా ప్రశ్న పత్రాలను పాఠశాలలో భద్రపరచాలని కోరారు. మండల విద్యాధికారులు ఎంఎస్ఓలు పరీక్షల నిర్వహణను పర్యవేక్షించాలని కోరారు.

మార్కెట్ అంటే లెక్కలేదా!?

- నిర్వహణను గాలికి వదిలేసిన ప్రభుత్వం
- పూర్తిస్థాయి కార్యదర్శి లేక ఇబ్బందులు
- మూడేళ్లుగా పాలకవర్గం ఖాళీ
- మద్దతు ధర, మౌలిక సదుపాయాలు నిల్
- సమస్యలతో సతమతమవుతున్న రైతులు
- ఇటువైపు కన్నెత్తి చూడని పాలకులు
- అధ్వాన స్థితిలో ఏనుమాముల మార్కెట్



ఏనుమాముల వ్యవసాయ మార్కెట్

వరంగల్ సిటీ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ ఆసియాలోనే రెండో అతిపెద్దదిగా గుర్తింపు పొందింది. అంతటి పేరున్న ఈ మార్కెట్ ప్రస్తుతం నిరాదరణకు గురవుతోంది. కొన్నేళ్లుగా పాలకులు పట్టించుకోకపోవడంతో అనేక సమస్యలతో సతమతమవుతోంది. పాలకవర్గం లేదు.. కార్యదర్శి లేడు.. తగినంత సిబ్బంది లేరు.దీంతో మద్దతు ధరలు పట్టించుకున్నవారు లేకుండాపోయారు. రైతులు, వ్యాపారులు, కార్మికులు సమస్యలను ఎవరికిచెప్పుకోవాలో తెలియని గందరగోళం ఏర్పడింది. దీంతో అందరిలో నిరాశ, నిస్పృహలు నెలకొన్నాయి. ముఖ్యంగా రైతులు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే దారం తెగిన గాలిపటంలా తయారైంది మార్కెట్ పరిస్థితి.

రాష్ట్రంలోనే అతిపెద్ద మార్కెట్..

రాష్ట్రంలోనే అతిపెద్ద మార్కెట్‌కు ప్రభుత్వం కార్యదర్శిని నియమించలేదు. పోలెపాక నిర్మల సస్పెన్షన్‌కు గురైన తరువాత ఆ స్థానంలో నర్సంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి గుగులోతు రెడ్యాకు అదనపు బాధ్యతలను కట్టబెట్టారు. ఆయన ఇటీవల నెల రోజుల పాటు లీవ్ పెట్టారు. దీంతో గ్రేడ్ 2 కార్యదర్శి రాము అనధికారికంగా ఇన్‌చార్జి కార్యదర్శిగా కొనసాగుతున్నారు.

పాలకవర్గం లేక మూడేళ్లు..

మార్కెట్‌కు పాలకవర్గం లేక దాదాపు మూడేళ్లు కావస్తోంది. ఈ విషయంలో బీఆర్ఎస్ ప్రభుత్వమే నిర్లక్ష్యం చేసిందంటే.. కాంగ్రెస్ సర్కారు కూడా అదేబాటలో నడుస్తోంది. పార్టీ అధికారంలోకి వచ్చి రేండెళ్లు గడిచినా ఇంతవరకు అతీగతీ లేకుండా పోయింది. గత ఫిబ్రవరిలో పాలకవర్గాన్ని నియమించినప్పటికీ అది చెల్లనిరూపాయిగా మిగిలిపోయింది. పాలకవర్గాన్ని నియమిస్తూ ప్రభుత్వం జీవో ఇచ్చిన మరుసటి రోజే ఎన్నికల కోడ్ రావడం, మరోవైపు వర్గపోరు తెరపైకి రావడంతో అధిష్టానం ఈ విషయాన్ని కోల్డ్‌స్టోరేజీలో పెట్టింది. ఇక అప్పటి నుంచి ఇప్పటివరకు వ్యవసాయశాఖ మంత్రిగానీ, జిల్లా మంత్రి గానీ, ఎమ్మెల్యేలు గానీ పట్టించుకున్న పాపానపోలేదు.

సిబ్బంది కొరత..

మార్కెట్‌లో 119 మంది ఉద్యోగులు పనిచేయాల్సి ఉండగా కేవలం 35మందితో నడిపిస్తున్నారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇరువై ఏళ్లగా మార్కెట్‌లో పనిచేసిన వారు ఉద్యోగ విరమణ చేస్తుంటే ఖాళీలు ఏర్పడుతున్నాయే తప్ప కొత్తగా ఉద్యోగాలను భర్తీ చేసింది లేదు. టార్గెట్లు పెట్టి మరీ మార్కెట్ ఫీజు వసూలు చేస్తున్న ప్రభుత్వం మార్కెట్లో ఉద్యోగాలను భర్తీ చేయడంలో మాత్రం శ్రద్ధ చూపడంలేదని రైతు సంఘాలు ఆరోపిస్తున్నాయి.

అమలుకాని మద్దతు ధరలు

ఆరుగాలం కష్టపడి పంట పండించిన రైతుకు మార్కెట్లో గిట్టుబాటు ధరలు పలుకడం లేదు. పత్తి, మక్కజొన్న, కందులు, పెసళ్లు, నువ్వులు, పల్లికాయ ఏ పంట తీసుకునాన క్వింటాళ్‌కు వంద నుంచి వెయ్యి రూపాయల వరకు తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వం రైతులకు మద్దతు ధర అందేలా చర్యలు తీసుకోవాల్సి ఉంది. మరోవైపు పత్తి సీజన్ మొదలైంది. సీసీఐ కేంద్రాలను ప్రారంభించాల్సి ఉంది. ఇప్పటికీ తేదీ నిర్ణయించకపోవడంతో రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

సమస్యలు పరిష్కరించే వారేరి..?

ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌తో పాటు లక్ష్మీపురంలోని కూరగాయల మార్కెట్, పండ్ల మార్కెట్, ఇటీవల కొత్తగా ముసలమ్మకుంటలో ప్రారంభించిన మామిడి మార్కెట్.. ఇలా ఏ మార్కెట్లో చూసినా కనీస సౌకర్యాలు కనిపించడంలేదు. ఏకంగా మంత్రి కొండా సురేఖ, మార్కెటింగ్‌శాఖ కమిషనర్ ఇచ్చిన హామీలే అమలు కాలేదంటే పరిస్థితి ఏవిధంగా అర్థం చేసుకోవచ్చని రైతు సంఘాలు మండిపడుతున్నాయి.

ఏనుమా ముల మార్కెట్ లో సీసీ కెమెరాలు కూడా లేవంటే ఇంతకంటే దురదృష్టకరమైన విషయం ఏమైనా ఉంటుందా అని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఇప్పటికైనా జిల్లాకు చెందిన మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, కెఆర్.నాగరాజు, రేవూరి ప్రకాష్‌రెడ్డి ఏను మాముల మార్కెట్‌ను సందర్శించి సమస్యలను పరిష్కరించాలని ఉమ్మడి జిల్లా రైతులు డిమాండ్ చేసున్నారు.

'కపాస్' యాప్ ద్వారా మద్దతు ధర

- రాష్ట్ర ఉద్యానవన శాఖ డైరెక్టర్ యాస్మిన్ బాషా
- జిల్లా అధికారులతో కలిసి ఏనుమాముల మార్కెట్ సందర్శన



శ్రీరాజ్ పత్తి మిల్లును సందర్శించిన యాస్మిన్ బాషా, ఇతర అధికారుల బృందం

వరంగల్ వ్యవసాయం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పత్తికి మద్దతు ధర పొందాలంటే ముందుగా కపాస్ కిసాన్ యాప్ ద్వారా స్లాట్ బుక్ చేసుకోవాలని రాష్ట్ర ఉద్యానవన శాఖ డైరెక్టర్, ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రొక్యూర్‌మెంట్ స్పెషల్ ఆఫీసర్ యాస్మీన్ బాషా పత్తి రైతులకు సూచించారు. బుధవారం ఆమె వరంగల్ అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి, హనుమకొండ అడిషనల్ కలెక్టర్ వెంకటిరెడ్డితో కలిసి ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌ను సందర్శించారు. అదేవిధంగా మార్కెటింగ్‌శాఖ డిప్యూటీ డైరెక్టర్ పద్మావతి, డీఎంవో సురేఖ, వరంగల్ డీఏవో అనురాధ, హనుమకొండ డీఏవో రవీందర్ సింగ్, మార్కెట్ గ్రేడ్ 2కార్యదర్శి అంజిత్‌రావు, ఏఎస్ రాజేందర్‌లతో కలిసి పత్తి యార్డులో పర్యటిం చారు. రైతులతో మాట్లాడి ధరల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. పత్తి నాణ్యత తగ్గకుండా చూసుకోవాలని, గుడ్డి పత్తిని మంచి పత్తితో కలుపవద్దని, తద్వారా మంచి పత్తికి కూడా ధర రాకుండా పోతుందని అన్నారు. రైతులు గ్రామాలలోనే వ్యవసాయ శాఖ అధికారుల వద్ద పంట వివరాలతో పాటు కపాస్ కిసాన్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. పత్తి అమ్ముకోవాలి అన్నప్పుడు సెల్‌ఫోన్‌తో కపాస్ కిసాన్ ద్వారా స్లాట్ బుకింగ్ చేసుకుని వచ్చిన వెంటనే పత్తి కొనుగోలు చేస్తారని రైతులకు వివరించారు. అనంతరం మార్కెట్ పరిధిలోని శ్రీరాజ్ కాటన్ ఇండస్ట్రీ మిల్లును పరిశీలించారు. మిల్లు యజమా నితో మాట్లాడుతూ.. కపాస్ కిసాన్‌యాప్‌కు సంబధించిన సమాచారం తెలిసేలా పెద్దగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని సూచించారు. కపాస్ కిసాన్ యాప్, స్లాట్ బుకింగ్‌పై రైతులకు పూర్తి అవగాహన కలిగించేలా గ్రామాలలో ప్రచారం చేయించాలన్నారు. వీడియో రికార్డుల ద్వారా విస్తృత ప్రచారం చేయాలని అధికారులను దేశించారు. ఈ సందర్భంగా కాటన్ సెక్షన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు చింతపల్లి వీరారావు, నాగభూషణం యాస్మీన్ బాషాకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.

యాసంగి వేళ విత్తనాల ఎంపికే కీలకం

వర్ధన్నపేట అక్టోబర్ 22 (ఆంధ్రజ్యోతి) : వానాకాలం పంటలు ఇపుడిపుడే చేతికందుతుండగా మరో వైపు యాసంగి వరితోపాటు కంది, పెసర, కూరగాయలు, శనగ, మొక్కజొన్న, పొద్దుతిరుగుడు తదితర పంటల సాగుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. ఇలాంటి సమయంలో విత్తనాల ఎంపికలో రైతులు జాగ్రత్తలు తీసుకోకుంటే నష్టం జరిగే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో విత్తనాల కొనుగోలులో అవలంబించాల్సిన విధానాలను వర్ధన్నపేట మండల వ్యవసాయ అధికారి విజయ్‌కుమార్ వివరించారు. నాణ్యమైన విత్తనాలు వంద శాతం జన్యు, 98 శాతం బాహ్య స్వచ్ఛత కలిగి ఉంటాయి. పంటను బట్టి 75 శాతం నుంచి 90 శాతం మొలకెత్తే శక్తి ఉంటుంది. ధాన్యంలో 10-12 శాతం, అపరాల్లో 8-9 శాతం తేమ ఉండేవాటిని కొనుగోలు చేయాలి. అంతర్గత చీడపీడలు లేనివాటిని ఎంచుకోవాలి.

బిల్లులు తప్పనిసరి..

విత్తనాల కొనుగోలు చేసేటపుడు గుర్తింపు పొందిన సంస్థల నుంచి తీసుకోవాలి. బిల్లుపై విక్రయదారు సంతకంతో పాటు విత్తన రకం, ఉత్పత్తి చేసిన సంస్థ పేరు, లాట్ నెంబర్ వంటి వివరాలు తప్పకుండా ఉండాలి. గడువు తేదీని పరిశీలించాలి. సీలు సరిగా లేకున్నా.. చిరిగినా లేదా పాడైన సంచులు, డబ్బాలను ఎట్టిపరిస్థితుల్లో తీసుకోవద్దు. వ్యవసాయశాఖ అనుమతిలేని విత్తనాలను లైసెన్స్ లేని అపరిచిత వ్యక్తుల నుంచి ఎట్టి పరిస్థితుల్లో కొనుగోలు చేయవద్దు.

సంచులపై వివరాలు..

పరీక్ష చేసిన తేదీ నుంచి 9 నెలల కాల పరిమితి దాటినవి కొనుగోలు చేయవద్దు. ఆకుపచ్చ, నీలిరంగు ట్యాగ్ ఉంటేనే ధృవీకరించినవి అనే విషయాన్ని రైతులు గుర్తుంచుకోవాలి. ఆకుపచ్చ, తెలుపు రంగు ట్యాగ్ కలిగినవి మూల విత్తనం. నీలిరంగు, తెల్లట్యాగ్ ఉంటే ధృవీకరణ చేసిన అధికారి సంతకం చేసి ఉంటుంది. ఏ ప్రాంతానికి ఏ కాలానికి అనువైనవి, ఆమోదించిన జీఈఏసీ నెంబరును చూసుకోవాలి.

రోడ్డుపై ధాన్యంతో వాహనదారులకు తిప్పలు



పాలకుర్తిలో ప్రధాన రోడ్డుపై ధాన్యాన్ని ఆరబోసిన రైతులు

పాలకుర్తి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలో వరికోతలు ఊపందుకున్నా యి. దీంతో రైతులు రోడ్లపై ధాన్యాన్ని ఆరబోసుకుంటున్నారు. మండల కేంద్రంలోని పాలకుర్తి, జనగామ ప్రధాన రహదారి ఆరబోస్తుండడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ధాన్యంపై రాకుండా రాళ్లు పెట్టడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. గత ఏడాది బమ్మెరలో, గత రెండేళ్ల క్రితం కొండాపురం వద్ద మోటార్ సైకిల్‌పై నుంచి పడి తీవ్రగాయాలై మృతి చెందిన ఘటనలూ ఉన్నాయి.

ఘనంగా కొమరం భీం జయంతి

- విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు

మహబూబాబాద్ టౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా ఆదివాసీ ఉద్యమ నేత కొమరంభీం జయంతిని బుధవారం నిర్వహించారు. ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ స్టేడియంలో కాళోజీ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కొమరంభీమ్ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు డోలి సత్యనారాయణ, జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెంట్ చింతా రమేష్ మాట్లాడారు. జల్, జంగల్, జమీన్ అందరికీ సమానంగా అందాలని, అవి ప్రజలందరి హక్కు అని వాటికోసం నిజాం నవాబుకు వ్యతిరేకంగా ఉద్యమించిన పోరాట యోధుడు కొమురం భీం అని కొనియాడారు. కార్యక్రమంలో ఎన్.వెంకటరెడ్డి, షైస శ్రీనివాస్, సోమ విష్ణువర్ధన్, రాచకొండ ఉపేందర్, పొనుగోటి రామకృష్ణరావు, రాము, భద్రునాయక్, వెంకటేశ్వర్లు, నాగేశ్వర్‌రావు, శ్రీనివాస్, దామోదర్, నర్సింహారావు, రవీందర్, రవి, నాగరాజు, శ్రీహరి, వెంకన్న పాల్గొన్నారు.



మానుకోటలో కొమరంభీమ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కాళోజీ వాకర్స్ అసోసియేషన్ బాధ్యులు

- కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) ఆధ్వర్యంలో కొమరం భీం జయంతిని నిర్వహించారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సెంటర్‌లో ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా అధ్య, కార్యదర్శులు చీపిరి యాకయ్య, దుడ్డెల రాంమ్మూర్తి, మందుల మహేందర్, మచ్చ వెంకన్న, కందూకూరి రాంబాబు, బేతమల్ల వెంకటాద్రి, అచ్చ నాగేష్, యాకన్న పాల్గొన్నారు.
- గిరిజన సామాజిక చైతన్య వేదిక ఆధ్వర్యంలో కొమురం భీం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు గుగులోతు కిషన్‌నాయక్, ప్రజా సంఘాల నాయకులు సంపంగి రాంచంద్రు, వాసం ఆనంద్, తిప్పర్తి శ్రీధర్, అల్వాల శ్రీనివాస్, వల్లెపు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.
- నలంద డిగ్రీ కళాశాలలో సామాజిక అధ్యయన వేదిక ఆధ్వర్యంలో ఎస్ఆర్. శంకరన్, కొమురం భీం జయంతిని నిర్వహించారు. వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ డోలి సత్యనారాయణ, వేదిక రాష్ట్ర అధ్యక్షుడు పార్శంది రామయ్య మాట్లాడుతూ జల్, జమీన్, జంగల్ నినాదంలో ఆదివాసీ హక్కుల కోసం కొమురంభీమ్ పోరాడారని, నిరాడంబరంగా ఉంటూ అత్యున్నత ఆదర్శాలకు కట్టుబడి ఉన్నత లక్ష్యాలను సాధించవచ్చని నిరూపించిన వ్యక్తి ఎస్ఆర్. శంకరన్ అని చెప్పారు. భిక్షం, హరి, ముత్తయ్య, కృష్ణ పాల్గొన్నారు.

ఇనుగుర్తిలో..

ఇనుగుర్తి పెద్దబస్టాండ్ సెంటర్‌లో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో కొమురం భీం చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు పప్పుల వెంకన్న, ప్రధాన కార్యదర్శి మహంకాళి రాంసలీమ్, కోశాధికారి గోపన్‌దాస్ కృష్ణ, దీకొండ వెంకన్న, గుజ్జునూరి బాబురావు, జాటోత్ హరిచంద్, పింగిలి శ్రీనివాస్, బేతమల్ల చంద్రయ్య, చిన్నాల కట్టయ్య, గందు నాగన్న, లక్ష్మయ్య, వెంకన్న, దార్ల భాస్కర్ పాల్గొన్నారు.



ఇనుగుర్తిలో కొమరం భీం విగ్రహానికి పూలమాల వేస్తున్న అంబేద్కర్ యువజన సంఘం నాయకులు

పోటెత్తిన మక్కలు

(5వ పేజీ తరువాయి)

ఈ నెల 28 మంగళవారం నుంచి కొత్త పత్తి కొనుగోళ్లను వ్యాపారులు ఖరీదులు చేయనున్నట్లు మార్కెట్ చైర్మన్ ఇస్లావత్ సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. పత్తిలో తేమ లేకుండా చెత్తాచెదారం శుభ్రం చేసి, నాణ్యత ఉన్న మంచి పత్తి తీసుకురావాలని, పత్తి నుంచి గుడ్డిపత్తిని వేరుచేసి తీసుకువస్తే పత్తికి మంచి ధర పలుకుతుందని చైర్మన్ తెలిపారు.

టీచర్లపై చర్య తీసుకోవాలి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించి, ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని డీఎస్ఎఫ్ఐ నాయకులు గుగులోతు సూర్యప్రకాష్, శివవర్మ అన్నారు. మహబూబాబాద్ మోడల్ స్కూల్ ఎదుట బుధవారం విద్యార్థినులతో కలిసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించారని, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.విద్యాబోధన చేయాల్సిన ఉపాధ్యాయులే అసభ్యకరంగా ప్రవర్తిస్తే ఎవరికి చెప్పుకువాలని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో నందు, సాయినాథ్, అరుణ్, వినయ్, సంతోష్ పాల్గొన్నారు.

నారాయణపురం సమస్యను పరిష్కరించాలి

- జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడికి రైతుల వినతి
- గ్రామాన్ని సందర్శిస్తానని హుస్సేన్‌నాయక్ హామీ



హైదరాబాద్‌లో హుస్సేన్‌నాయక్‌కు వినతిపత్రం అందజేస్తున్న నారాయణపురం రైతులు

కేసముద్రం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నారాయణపురంలో తమ భూములకు పట్టాదారు పాస్‌పుస్తకాలివ్వాలని కోరుతూ హైదరాబాద్‌లో బుధవారం జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్ నాయక్‌కు ఆ గ్రామ రైతులు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ 60 ఏళ్లగా సాగు చేసుకుంటున్న 1827 ఎకరాల పట్టాభూములకు భూప్రక్షాళనలో తమ పట్టాలను అప్పటి ప్రభుత్వం నిలిపివేసిందని తెలిపారు. పలుమార్లు సర్వేలు, ఆందోళనల అనంతరం కొంతమంది రైతులకు పట్టాలు వచ్చాయని తెలిపారు. 1100 ఎకరాల్లో 700 మంది రైతులకు పట్టాపాస్‌పుస్తకాలు రావాల్సిఉందని, ఇవి లేకపోవడంతో కోట్ల రూపాయల ప్రభుత్వ పథకాలు రైతులకు అందకుండా నష్టపోయామని వాపోయారు. సం బంధిత అధికారులు పట్టాపాస్‌పుస్తకాలివ్వడానికి తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారని కమీషన్ సభ్యునితో గిరిజన రైతులు వాపోయారు. దీంతో హుస్సేన్‌నాయక్ స్పందిస్తూ తన బృందంతో గ్రామాన్ని సందర్శించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆ గ్రామ రైతులు ధరావత్ రవి, జాటోత్ వెంకన్న, సురేష్, గుగులోత్ శంకర్, విరాసింగ్, లచ్చు, దేవా, లక్‌పతి, రాములు, శ్రీను, రమేష్, శ్రీనివాస్, బాషా పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణా నిర్మూలన అందరి బాధ్యత

- జిల్లా విద్యాశాఖాధికారి దక్షిణామూర్తి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : మానవ అక్రమ రవాణా నిర్మూళన అందరి బాధ్యత అని జిల్లా విద్యాశాఖాధికారి దక్షిణామూర్తి అన్నారు. మహబూబాబాద్ మోడల్ స్కూల్‌లో బుధవారం ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ, రాష్ట్ర విద్యాపరిశోధన శిక్షణ మండలి ఆధ్వర్యంలో మానవ అక్రమ రవాణా, లైంగిక వేధింపులు, సైబర్ నేరాలు మొదలగు అంశాలపై రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ మానవ అక్రమ రవాణ నిర్మూలనలో ప్రజలందరు భాగస్వాములయినప్పుడే నివారించగలమని పేర్కొన్నారు. సైబర్ నేరాలు, సెల్‌ఫోన్‌లో వచ్చే మెస్సేజ్‌లపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విద్యార్థినులు సెల్ ఫోన్‌లలో ఫొటోలు, వీడియోలు పంపవద్దన్నారు. మానవ అక్రమ రవాణా, లైంగిక వేధింపులు, సైబర్ నేరాలు, బీఎన్ఎస్, ఐటీపీఏ, ఫోక్సో, సఖీ, భరోసా, చైల్డ్‌లైన్, పోలీస్ టోల్ ఫ్రీ నెంబర్ 1098, 100, 181, 1930లపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో విజయకుమారి, చంద్రయ్య, ఉషారాణి పాల్గొన్నారు.

సామర్థ్యాలను పెంపొందించాలి..

తరగతుల వారీగా విద్యార్థుల్లో సామర్థ్యాలను పెంపొందించాలని ఉపాధ్యాయులకు డీఈవో సూచించారు. జిల్లా కేంద్రంలోని హనుమంతునిగూడెం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను బుధవారం సందర్శించి పాఠశాల నిర్వహణ రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని, బోధనలో సృజనాత్మకత, విద్యార్థి సులువుగా నేర్చుకునే పద్ధతులు పాటిస్తూ బోధన చేయాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న దక్షిణామూర్తి

అక్రమ మిల్లర్లపై కొరడా

5వ పేజీ తరువాయి)

తనఖీలు చేపట్టారు. బకాయిలు పెండింగ్ పెడుతున్న మిల్లర్లపై అధికారులు క్రిమినల్ కేసులు నమోదు చేశారు. జిల్లాలో 2022 నుంచి ప్రభుత్వం ఇచ్చిన ధాన్యాన్ని మిల్లరు కాజేసి బకాయిలు పడ్డారు. జిల్లాలో 12.76 కోట్ల విలువైన ధాన్యాన్ని మిల్లర్లు బాకాయి పడ్డారు. మిగతా జిల్లాలతో పోల్చితే హనుమకొండ జిల్లాలో సీఎంఆర్ ధాన్యం బకాయిలు తక్కువగానే ఉన్నాయి.

ఈ జిల్లాలో సుమారు అయిదు రైస్ మిల్లులు 1450 మెట్రిక్ టన్నుల బియ్యం మిల్లర్లు బకాయి ఉన్నారు. వరంగల్ జిల్లాలో 20 మిల్లులు బియ్యం బకాయిపడ్డాయి ఈ మొత్తం 10వేల మెట్రిక్ టన్నుల మేరకు ఉండవచ్చునని అంచనా. ములుగు జిల్లాలో 2023, 2024 సంవత్సరాలకు సంబంధించి ఒక మిల్లు రూ2.16కోట్ల విలువైన సీఎంఆర్ బియ్యం బకాయి పడడటంతో ఆ మిల్లును డీఫాల్టులో పెట్టడమే ఆకుండా రికవరీ కోసం కేసు కూడా నమోదు చేశారు. మహబూబాబాద్ జిల్లాలో సుమారు పదికిపైగా మిల్లులు సీఎంఆర్ బకాయి ఉన్నాయి.

బకాయిలను విడుదల చేయాలి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పదవీ విరమణ పొందిన ఉద్యోగ, ఉపాధ్యాయుల బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ (రెవా) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సంకా బద్రినారాయణ, గుగులోతు కిషన్‌నాయక్ డిమాండ్ చేశారు. మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో బుధవారం జిల్లా అదనపు కలెక్టర్ అనిల్ కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...2024 మార్చి నుంచి నేటి వరకు ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావల్సిన జీపీఎఫ్, గ్రాట్యుటీ మొదలగు బెనిపిట్స్ విడుదల చేయాలన్నారు. పెన్షన్‌దారులు ఆర్థికంగా అనేక ఇబ్బందులు పడుతున్నారని, గతంలో ఇలాంటి పరిస్థితి ఉండేది కాదన్నారు. ఈ కార్యక్రమంలో సోమగోవర్దన్, యోగీశ్వర్ రావు, చంద్రమౌళి, వెంకటేశ్వర్లు, పద్మ, వెంకన్న, లక్ష్మీ, రవీందర్, గోవర్దన్, మురళీధరస్వామి, నిరంజన్‌రెడ్డి, రమేష్‌బాబు పాల్గొన్నారు.



అదనపు కలెక్టర్ అనిల్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రెవా బాధ్యులు

బయ్యారంలో ఐదుగురి బైండోవర్

బయ్యారం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : స్థానిక బస్టాండ్ సెంటర్ మెయిన్ రోడ్‌పై సోమవారం ఇరు వర్గీయుల నడుమ జరిగిన ఘర్షణకు సంబంధించి ఐదుగురు వ్యక్తులపై బుధవారం బైండోవర్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై తిరుపతి పేర్కొన్నారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం. శాంతి భద్రతలకు విఘాతం కలిగేలా బయ్యారం మెయిన్ రోడ్ సెంటర్‌లో అలజడులు (న్యూసెన్స్) చేసిన ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని బైండోవర్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. బాల్యతండాకు చెందిన ఆదిత్య, ప్రవీణ్, గణేష్, నవీన్‌తో పాటు సంగ్యాతండాకు చెందిన వెంకటేష్‌లు న్యూసెన్స్ చేస్తూ శాంతి భద్రతలకు భంగం కలిగేలా ప్రవర్తించడంతో కేసు నమోదు చేసి స్థానిక తహసీల్దార్ నాగరాజు ఎదుట బైండోవర్ పరిచినట్లు వెల్లడించారు. కాగా, భవిష్యతులో కూడా ఏవరైనా న్యూసెన్స్‌కు పాల్పడితే చట్ట పరంగా కఠినంగా శిక్షించాల్సి వస్తుందని హెచ్చరించారు.

ప్రమాదవశాత్తు కాల్వలో జారిపడి వ్యక్తి మృతి

డోర్నకల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : మంచినీరు తాగేందుకు కాలువలోకి దిగిన వ్యక్తి ప్రమాదవశాత్తు జారిపడి నీళ్లలో మునిగి మృతి చెందిన ఘటన మంగళవారం రాత్రి డోర్నకల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అందనాలపాడులో చోటు చేసుకుంది. డోర్నకల్ హెడ్‌కానిస్టేబుల్ రాజు తెలిపిన వివరాల ప్రకారం. అందనాలపాడు గ్రామానికి చెందిన గోవింద గురులింగం (48)కు ఎకరం వ్యవసాయ భూమి ఉంది. అందులో వరిపంటను సాగు చేశాడు. దీంతో పాటు టైలర్ పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. మంగళవారం తన పొలం వద్దకు వెళ్లిన గురులింగం కొంతసేపటికి దాహం వేస్తుండడంతో సీతారామప్రాజెక్టు కాలువలో ఉన్న మంచినీరు తాగేందుకు లోపలికి దిగాడు. కాలువలో ప్రమాదవశాత్తు జారిపడ్డాడు. గురులింగంకు ఈతరాకపోవడంతో నీళ్లలో మునిగి మృతి చెందాడు. మృతుడికి భార్య సుజాత, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. మృతిని భార్య సుజాత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ రాజు తెలిపారు.

వీరభద్రస్వామి దేవాలయంలో పూజలు

కురవి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : కురవి శ్రీవీరభద్రస్వామి దేవాలయంలో కార్తీకమాసం పురస్కరించుకుని తొలిపూజలు ప్రారంభమయ్యాయి. బుధవారం ఉదయం నుంచే వేద పండితులు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. సాయంత్రం కార్తీకమాసానికి గుర్తుగా ఆకాశదీపాన్ని వెలిగించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. అర్చకులు రెడ్యాల శ్రీనివాస్, అనిల్, విజయ్, బాలకృష్ణ పాల్గొన్నారు.

ఉదయశ్రీకి వృందాణి అవార్డు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : పట్టణ కేంద్రానికి చెందిన తాండవ కృష్ణ నృత్యాలయ డైరెక్టర్ ఉదయశ్రీ వృంద్రాణి అవార్డు అందుకున్నారు. భారతీయ శాస్త్రీయ, నృత్య కళారంగంలో విశిష్ట ప్రతిభ కనబరిచిన కళాకారులను గుర్తించి వారికి ప్రతిష్టాత్మక వృంద్రాణి అవార్డును అందజేశారు. అందులో భాగంగా ఈ ఏడాది తమిళనాడు రాజధాని చెన్నయ్‌లోని ఎగ్మోర్ ఆడిటోరియంలో ఈ నెల 19, 20 తేదీల్లో ది లాస్య ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో లాస్య ఆర్గనైజేషన్ అధినేత రాజీమరియన్ తాండవ కృష్ణ నృత్యాలయ డైరెక్టర్ ఉదయశ్రీని వృంద్రాణి అవార్డుతో ఘనంగా సన్మానించారు.

వరికి మద్దతు ధర రూ. 2,389



బయ్యారంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

బయ్యారం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : వానాకాలం పంట ఏ గ్రేడ్ ధాన్యానికి మద్దతు ధర రూ.2,389గా ప్రభుత్వం నిర్ణయించినట్లు మండల ప్రత్యేక అధికారి శ్రీనివాస్‌రావు పేర్కొన్నారు. వానాకాలం ధాన్యం సేకరణపై బుధవారం సంబంధిత కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సన్న రకాలకు ప్రభుత్వం ఎంఎస్‌పీపై అదనంగా రూ.500 చెల్లించనున్నట్లు తెలిపారు. చెల్లింపుల్లో మధ్యవర్తుల ప్రమేయానికి ఆస్కారం లేకుండా తెలంగాణ ప్రభుత్వం ఓపీఎంఎస్ విధానాన్ని తీసుకొచ్చినట్లు పేర్కొన్నారు. అనంతరం ఐకేపీ, పీఏసీఎస్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు చేసే నిర్వాహకులకు సేకరణకు సంబంధించిన నాణ్యతా ప్రమాణాలు, జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. రైతులకు కల్పించే సదుపాయాలపై సూచనలు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ నాగరాజు, సీఐ రవికుమార్, ఎస్సై తిరుపతి, ఎంపీడీవో దైవాదీనం, ఏవో రాజు, సీఈవో సురేందర్, ఏపీఎం తిర్మల్‌సింగ్‌లతో పాటు ఏఈవోలు పాల్గొన్నారు.

చికిత్సపొందుతూ వృద్ధుడు మృతి

డోర్నకల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : దీపావళి పండుగ జరుపుకునేందుకు కుమార్తె ఇంటికి వచ్చిన వృద్ధుడు కడుపునొప్పి తట్టుకోలేక పురుగుల (గడ్డినివారణ)మందు తాగి, చికిత్స పొందుతూ చికిత్సపొందుతూ మృతి చెందినట్లు డోర్నకల్ పోలీస్‌స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ రామన్న తెలిపారు. రామన్న తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లా సింగరేణి మండలం భాగ్యనగర్ తండాకు చెందిన బానోత్ సామ్య (74) డోర్నకల్ మండలం చాంప్లాతండాలో నివాసముండే తన కుమార్తె ఇస్లావత్ శారద ఇంటికి వచ్చాడు. సామ్యకు కడుపునొప్పి తీవ్రంగా వస్తుండడంతో బాధతట్టుకోలేక ఇంట్లో ఎవరు లేని సమయంలో కలుపునివారణ మందు తాగాడు. ఇది గమనించిన కుటుంబసభ్యులు హుటాహుటిన చికిత్స నిమిత్తం ఆటోలో మహబూబాబాద్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ.. బుధవారం తెల్లవారుజామున సామ్య మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె సంతానం. మృతుడి కుమారుడు రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

రహదారుల నిర్మాణాలను పూర్తి చేయాలి

గంగారం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : గంగారం మండల వ్యాప్తంగా ఉన్న అసంపూర్తి రహదారులను పూర్తి చేయాలని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి పూనెం ప్రభాకర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మండలంలోని అసంపూర్తి రహదారులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖమంత్రి గంగారం, కొత్తగూడ మండలాలకు కోట్లాదిరూపాయలు నిధులు ఖర్చు చేస్తున్నామని శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తున్నా.. ప్రధాన రహదారులన్నీ అధ్వానంగా మారాయని అన్నారు. కొన్ని గ్రామాలలో రహదారులు నడవలేని స్థితిలో ఉన్నాయన్నారు. అత్యవసర సమయంలో వైద్యం నిమిత్తం పందెం నుంచి గంగారం వెళ్లాలంటే నరకం కనిపిస్తుందని అన్నారు. ఏజన్సీలో ప్రజల అభివృద్ధికి కోట్ల రూపాయలు ఖర్చు చేసే పాలకులు రోడ్ల దుస్థితిపై ఎందుకు స్పందించరని అన్నారు. రోడ్ల మరమత్తులు చేయకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. జోగ రామయ్య, నూనెం రవికుమార్, సాయిరాం, సతీష్, సాయి, జ్యోతిలక్ష్మీ, సుమలత, సమ్మక్క తదితరులు పాల్గొన్నారు.

కొనుగోళ్లపై సన్నాహక సమావేశం

ఇనుగుర్తి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఇనుగుర్తి రైతు వేదికలో బుధవారం వరి కొనుగోలు కేంద్రాల ఏర్పాటు కోసం సన్నాహక సమావేశం సివిల్ సప్లై జిల్లా మేనేజర్, మండల ప్రత్యేకాధికారి కృష్ణవేణి ఆధ్వర్యంలో నిర్వహించారు. రైతులు పూర్తిగా ఆరబెట్టి, చెత్తాచెదారం లేకుండా నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి ప్రభుత్వ మద్దతు ధర పొందాలని సూచించారు. తహసీల్దార్ తరంగిణి, ఎంపీడీవో పార్థసారథి, ఎస్ఐ జి.కరుణాకర్, సెంటర్ ఇన్‌చార్జీలు, రైస్ మిల్లర్లు, జీపీవోలు, వ్యవసాయ, పోలీసు శాఖ, ఐకేపీ, సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.



రైతువేదికలో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి కృష్ణవేణి

శివమాల ధరించిన కేసముద్రం వాసులు

కేసముద్రం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెనుగొండ, బేరువాడ గ్రామాలకు చెందిన 30 మంది మహబూబాబాద్ మార్కండేయ దేవాలయంలో బుధవారం శివమాలను ధరించారు. ఆలయ అర్చకులు లక్ష్మీనర్సింహస్వామిమూర్తి ఆధ్వర్యంలో నియమనిష్టలతో కూడిన ఈ శివమాల మండల దీక్షను స్వీకరించారు. కార్యక్రమంలో గురుస్వామి నలమాస శ్రీశైలంగౌడ్, పొదిల నర్సింహారెడ్డి, మెరుగు రమేష్, నలమాస జగన్ పాల్గొన్నారు.

పోలీస్ అమరవీరుల సంస్మరణ దినం



కొవ్వొత్తులతో నివాళ్లర్పిస్తున్న ఎస్సైలు, పోలీస్ సిబ్బంది

డోర్నకల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : విధి నిర్వహణలో అసువులు బాసిన పోలీస్ అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా డోర్నకల్‌లో బుధవారం పోలీసులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. డోర్నకల్ ఎస్సైలు గడ్డం ఉమ, ఖాదర్‌పాషా ఆధ్వర్యంలో స్థానిక రైల్వేసెంటర్ నుంచి గాంధీ సెంటర్ వరకు పోలీసులు ప్రజలతో కలిసి కొవ్వొత్తులతో ర్యాలీ చేపట్టారు. అనంతరం ఉయ్యాలవాడ క్రాస్‌రోడ్డు వద్ద ఉన్న నున్న మదన్ స్మారక స్థూపం వద్ద కొవ్వొత్తులు వెలిగించి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఎస్సై ఉమ, ఖాదర్‌పాషా మాట్లాడుతూ.. పోలీసులు ప్రజల కోసమే పని చేస్తున్నారని, విధి నిర్వహణలో ఎన్నో కఠినమైన సవాళ్లను ఎదుర్కొంటూ బాధ్యతతో కూడిన విధులను పోలీసులు నిర్వహిస్తుంటారని చెప్పారు. ప్రజలు పోలీసులకు సంపూర్ణ సహకారం అందించినప్పుడు అన్ని రకాల నేరాలను అరికట్టవచ్చన్నారు. పోలీస్ సిబ్బంది, మదన్ కుటుంబసభ్యులు, స్నేహితులు, పాల్గొన్నారు.



హైస్కూల్లో కంప్యూటర్ అందజేస్తున్న భూక్య శోభన్‌బాబు

పాఠశాలకు కంప్యూటర్ బహూకరణ

ఇనుగుర్తి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఇనుగుర్తి జడ్పీ ఉన్నత పాఠశాలకు బుధవారం అయ్యగారి పల్లికి చెందిన పూర్వ విద్యార్థి భూక్య శోభన్‌బాబు రూ.33 వేల విలువైన కంప్యూటర్‌ను బుధవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం రూపారాణి, ఆయన స్నేహితులు దేవేందర్, మధు, వీరేష్, యాకన్న, రాజు, రంగన్న, లక్ష్మణ్, అశోక్ పాల్గొన్నారు.

పాలకుర్తిలో కొవ్వొత్తుల ర్యాలీ



కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు

పాలకుర్తి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి మండల కేంద్రంలో పోలీసులు, విద్యార్థులతో కలిసి పోలీస్‌స్టేషన్ నుంచి రాజీవ్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. పోలీస్ అమరుల త్యాగాలు గుర్తు చేసుకొని అమరవీరుల చిత్రపటానికి నివాళులర్పించారు. సీఐ జానకిరాంరెడ్డి మాట్లాడుతూ ప్రజల ప్రాణాలు, ఆస్తుల పరిరక్షణలో విధి నిర్వాహణలో అమరులైన పోలీసుల త్యాగాలను ఎప్పటికి మరిచి పోలేమన్నారు. కార్యక్రమంలో పాలకుర్తి పవన్‌కుమార్, లింగారెడ్డి, యాకూబ్ హుస్సేన్, దేవరుప్పుల ఎస్సై సృజన్‌కుమార్ తదితరులు ఉన్నారు.